క్లుప్తంగా

వెంకటరత్నరాజుకు అభినందనలు



నందిగామ రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని పూర్తి స్థాయిలో పటిష్టపరచాల్సిన బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందని మాజీ శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. ఐటీ విభాగం జిల్లా కన్వీనర్‌గా నియమితులైన పచ్చిగోళ్ల వెంకటరత్నరాజు స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం జగన్‌మోహనరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ పార్టీ పదవులు పొందిన వారి పార్టీ అభివృద్ధి, పటిష్టతకు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని కోరారు. ముఖ్యంగా కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. అధికారంలోకి వచ్చి ఏడాది కాలం పూర్తవుతున్నా ఒక్క పథకాన్ని అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను చంద్రబాబు నిలువునా మోసం చేశారని ధ్వజమెత్తారు. అనంతరం వెంకటరత్నరాజును అభినందించి ఘనంగా సత్కరించారు.

వాహనాల వేలం ద్వారా రూ.23 లక్షల ఆదాయం

జగ్గయ్యపేట: సర్కిల్ పరిధిలో మద్యం కేసుల్లో పట్టుబడ్డ వివిధ వాహనాల వేలం ద్వారా ప్రభుత్వానికి రూ.23 లక్షల ఆదాయం సమకూరిందని సర్కిల్ ఎక్సైజ్ సీఐ బి. గురవయ్య తెలిపారు. తొర్రగుంటపాలెంఎక్సైజ్ కార్యాలయం వద్ద గురువారం మద్యం కేసుల్లో పట్టుపడ్డ 12 వాహనాలకు వేలం నిర్వహించారు. ఈ వేలంలో ప్రభుత్వానికి ఆ మేరకు ఆదాయం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

అంబులెన్సులకు అనారోగ్యం

- 25 రోజులకు పైగా మూలనపడ్డ రెండు అంబులెన్స్ వాహనాలు
- రోడ్డు ప్రమాదాలు జరిగే సమయంలో ఇబ్బందులు పడుతున్న బాధితులు
- సకాలంలో అందుబాటులోలేని 108 అంబులెన్స్ వాహనాలు



కంచికచర్లలో 108 అంబులెన్స్ వాహనాలు లేక ఖాళీగా దర్శనమిస్తున్న షెడ్డు

కంచికచర్ల: కంచికచర్ల, వీరులపాడు మండలాలకు చెందిన రెండు 108 అంబులెన్స్ వాహనాలు అనారోగ్యానికి గురయ్యాయి. అవి మంచానపడటంతో వాటి ఆలనాపాలనా చూసే దిక్కు లేరు. 25 రోజుల క్రితం రెండు మండలాల అంబులెన్స్ వాహనాలు మరమ్మతులకు గురయి గొల్లపూడిలోని మెకానిక్ షెడ్డుకు తరలివెళ్లాయి. 25 రోజుల నుంచి రెండు మండలాల్లో రోడ్డు ప్రమాదాలు జరిగితే వాహనాలు అందుబాటులో లేకుండా పోయాయి. అంతేకాకుండా గర్భిణులకు సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలంటే అందుబాటులో లేకుండా పోయాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఇటీవల వీరులపాడు మండలం జుజ్జూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. 108 అంబులెన్స్ వాహనాలు అందుబాటులో లేకపోవటంతో ప్రైవేటు వాహనాల ద్వారా వెళ్లాల్సి వచ్చింది.

కంచికచర్ల పరిధిలో ఏడు యాక్సిడెంట్లు జోన్లు...

కంచికచర్ల మండలం, వీరులపాడు మండలాల్లో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. వీరులపాడు మండలంలో ఆర్అండ్‌బీ రోడ్లు, జిల్లా పరిషత్‌రోడ్లు ఎక్కువగా మూలమలుపులు ఉన్నాయి. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు తప్పుకునే క్రమంలో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. కంచికచర్ల మండలంలో 17 కిలో మీటర్ల మేర జాతీయ రహదారి ఉంది. ఆ రహదారిపై నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎక్కువగా కంచికచర్ల చెరువుకట్ట, పేరకలపాడు క్రాస్ రోడ్డు. మద్యం దుకాణాలున్న జుజ్జూరు రోడ్డు, కంచికచర్ల ఫ్లైఓవర్, పరిటాల ఆంజనేయ స్వామి విగ్రహం సమీపంలో, దొనబండ క్వారీలు, కీసర బ్రిడ్జిపై, కీసర ప్రధాన కూడలి వద్ద, పరిటాల గనిఆత్కూరు రోడ్డు అండర్‌పాస్ వద్ద ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల పేరకలపాడు క్రాస్‌రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయితే ప్రైవేటు వాహనాన్ని ఆశ్రయించాల్సి వచ్చింది.

గత ప్రభుత్వంలో వైద్యానికి పెద్ద పీట



గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు అన్ని రకాలు వైద్య సేవలు ఉచితంగా అందాలని వైద్యులనే రోగి ఇంటికి పంపించారు. ఏ ఒక్క అంబులెన్స్ వాహనం మరమ్మతుకు గురయినా తక్షణమే పనులు చేయించి రోగులకు అవసరమైన వైద్యసేవలు సకాలంలో అందేలా చేశారు. ప్రస్తుతం అటువంటి పరిస్థితి లేదు, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి 108 అంబులెన్స్ వాహనాలపై చిన్న చూపు చూస్తోంది.

–షేక్ షాన్‌బహుదూర్ రైతు, పెండ్యాల

గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు



గర్భిణులకు సకాలంలో వైద్య పరీక్షలు చేయించేందుకు 108 అంబులెన్స్‌లు గతంలో సకాలంలో స్పందించేవి. వారంతా సుఖ ప్రసవం జరిగేది. కానీ ఇప్పుడు ప్రైవేటు వాహనాల ద్వారా ఆసుపత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు. పేదలంటే చంద్రబాబుకు చులకనగా ఉంది. ఎక్కువగా పేదలు మాత్రమే 108 అంబులెన్స్‌లను ఉపయోగించుకుంటున్నారు. కానీ అవి మరమ్మతులకు గురయినా ఎవరూ పట్టించుకోవటంలేదు.

షేక్ శ్రీనివాసరావు కీసర

రోజుకు ఐదుకు పైగా రోడ్డు ప్రమాదాలు..

కంచికచర్ల మండలంలోని పలు గ్రామాలు జాతీయ రహదారికి ఆనుకుని ఉండటంతో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. రోజుకు ఐదు లేదా ఆరు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని 108 అంబులెన్స్ వాహన సిబ్బంది అంటున్నారు. అంతేకాకుండా గర్భిణులతో పాటు అనారోగ్యానికి గురయిన బాధితులు రోజుకు మరో ఐదు కేసులు రావటంతో వారికి వాహనంలోనే ప్రథమ చికిత్స అందజేసి మెరుగైన వైద్యం కోసం బాధితులు కోరుకున్న ఆసుపత్రికి తరలిస్తామని సిబ్బంది తెలిపారు.

నాడు రోడ్డుపై కుయ్... కుయ్.. నేడు నయ్.. నయ్...

గత ప్రభుత్వంలో 108 నెంబర్‌కు ఫోన్ చేయగానే కుయ్.. కుయ్ మంటూ ప్రాంతాన్ని బట్టి 5 నిమిషాల్లోపు ఘటనా స్థలానికి అంబులెన్స్ వాహనాలు చేరుకునేవి. ముందుగా బాధితులకు ప్రథమ చికిత్స అందజేసి మెరుగైన వైద్య సేవల కోసం బాధితులు కోరుకున్న ఆసుపత్రికి తీసుకెళ్లి చేర్పుతున్నామని 108 అంబులెన్స్ వాహన సిబ్బంది అంటున్నారు. నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 108 అంబులెన్స్ వాహనాలు మూలనపడ్డాయి. వాటి గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఆరోగ్యానికి పెద్ద పీట వేస్తామన్న కూటమి నాయకులు మాత్రం 108 వాహనాలు మరమ్మతులకు గురయినా పట్టించుకోవటంలేదు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి మూలనపడ్డ 108 అంబులెన్స్ వాహనాలకు మరమ్మతులు చేయించి రోగులు, ప్రజలు, గర్భిణులకు అందుబాటులో ఉండేలా చూడాలని కోరుతున్నారు.

పార్టీ విజయమే లక్ష్యంగా పని చేయాలి

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన జనసేన నాయకులు



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్:వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పటిష్టతతో పాటు రానున్న ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా పని చేయాలని మాజీ శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. కంచికచర్ల మండలం చెవిటికల్లు గ్రామానికి చెందిన జనసేన పార్టీ నాయకులు మంగిశెట్టి అప్పారావు, సింగంశెట్టి శ్రీనివాసరావులు స్థానిక పార్టీ కార్యాలయంలో ఆ పార్టీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ రానున్న కాలంలో సముచిత స్థానం ఉంటుందని చెప్పారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందించటంలో పూర్తిగా విఫలమైందని తెలిపారు. ఎన్నికలకు ముందు చెప్పిన సూపర్ సిక్స్ పథకాల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేకపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. కూటమి ఏడాది పాలనలపై సొంత పార్టీ నేతలే పెదవి విరుస్తున్న పరిస్థితులు నెలకొన్నాయన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతోనే పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు మంచి జరుగుతుందని తెలిపారు. రానున్న కాలంలో కూటమి పార్టీల నుంచి మరిన్ని చేరికలుంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు వాసు, పలువురు గ్రామ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా హనుమజ్జయంతి వేడుకలు

వత్సవాయి:హనుమజ్జయంతి వేడుకలు గురువారం మండలంలోని పలు గ్రామాల్లో వైభవంగా నిర్వహించారు. వత్సవాయి, పోలంపల్లి, కంభంపాడు, చిట్టేల, మక్కపేట, భీమవరం, గోపినేనిపాలెం, మంగొల్లు గ్రామాల్లోని ఆలయాల్లో వేకువజాము నుంచే పూజలు ప్రారంభమయ్యాయి. తమలపాకు పూజలు, హోమాలు చేశారు. హనుమంతునికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కొన్ని గ్రామాలలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో....

వీరులపాడు:మండలంలోని జయంతి గ్రామంలో వేంచేసియున్న అభయాంజనేయ స్వామి వారి ఆలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో గురువారం హనుమత్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామి వారిని ప్రత్యేకంగా నిమ్మకాయలు, సింధూరంతో అలంకరించి తమలపాకులు, తులసీదళాలతో విశేష పూజలు చేశారు. గ్రామంలోని ఊర చెరువు నుంచి గ్రామస్తులు జలబిందెలతో నీటిని తీసుకువచ్చి అభిషేకం నిర్వహించారు. భక్తులు హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. టీటీడీ తరపున బాల సుబ్రహ్మణ్యం హనుమత్ జయంతి వేడుకలను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గ్రామాల్లో మార్మోగిన శ్రీరామ నామస్మరణ....

నందిగామ రూరల్:మండలంలోని పల్లగిరి, కెకండ్రిక అగ్రహారం, దాములూరు, కూడలి, ఐతవరం, కంచ, తొర్రగుడిపాడు, అడవిరావులపాడులతో పాటు ఆయా గ్రామాలు శ్రీరామ నామస్మరణతో మార్మోగాయి. కెకండ్రిక గ్రామంలో వేంచేసియున్న దాసాంజనేయ స్వామి వారి ఆలయంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఆలయ చైర్మన్ మేడా రామారావు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పల్లగిరి గట్టుపై వేంచేసియున్న అభయ వీరాంజనేయ స్వామి వారి ఆలయంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ పబ్బతి నరసింహారావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



జయంతిలో స్వామి వారి అభిషేకానికి జలబిందెలతో నీటిని తీసుకొస్తున్న భక్తులు

స్వామికి అర్చనలు, అభిషేకాలు...

పెనుగంచిప్రోలు: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సెంటర్‌లో స్వామివారికి అర్చకులు ఆంజనేయశర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు, తమలపాకులతో పూజలు నిర్వహించారు. తూర్పు బజారు కోదండ రామాలయం, డౌన్ సెంటర్, లింగగూడెం రోడ్డు, కొణకంచి క్రాస్‌రోడ్స్ వద్ద వద్ద ఆంజనేయ స్వామి వారి ఆలయాల్లో ప్రత్యేక పూజలతో పాటు పలు చోట్ల అన్నదానం నిర్వహించారు.

ఘనంగా ఆంజనేయస్వామి దివ్య కల్యాణం

నందిగామ టౌన్:దాసాంజనేయ స్వామి, సీతా రామాంజనేయ స్వామి వారి ఆలయాల్లో హనుమజ్జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. రథం బజార్‌లోని దాసాంజనేయ స్వామికి అరటి, మామిడి పండ్లతో తమలపాకు పూజ చేశారు. వేద మంత్రోచ్ఛరణల నడుమ సువర్చల సహిత ఆంజనేయ స్వామి వారి దివ్య కల్యాణం నిర్వహించారు. వాసవి కన్యకా పరమేశ్వరీ అమ్మవారి శ్రీచక్ర మందిరంలో హనుమాన్‌చాలీసా పారాయణ, ప్రత్యేక పూజలు, అన్న ప్రసాద కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం 5 వేల మంది భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నసమారాధన చేశారు. కంచికచర్ల పాత శివాలయంలో భక్తులు స్వామి వారికి విశేష పూజలు చేశారు. మహన్యాసపూర్వక అభిషేకాలు, నీరాజన మంత్ర పుష్పములు, అష్టోత్తర పూజలు చేశారు. తమలపాకులతో స్వామికి అర్చన చేశారు. మండలంలోని గండేపల్లి, కీసర, పెండ్యాల, గని ఆత్కూరు, మున్నలూరు, కునికెనపాడు, చెవిటికల్లు, గొట్టుముక్కల తదితర గ్రామాల్లోని ఆలయాల్లో హనుమత్ జయంతి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

ఆలయాల్లో హనుమాన్ చాలీసా పారాయణం...

జగ్గయ్యపేట:మండలంలోని పలు గ్రామాల్లో వేంచేసియున్న రామాలయాలు, ఆంజనేయ స్వామి వారి ఆలయాల్లో గురువారం హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో హనుమాన్ చాలీసా పారాయణ, తమలపాకు పూజ, తదితర కార్యక్రమాలను అర్చకులు వైభవంగా నిర్వహించారు. మండలంలోని బలుసుపాడు గ్రామంలోని గురుధాం ఆశ్రమంలో స్వామి వారికి అభిషేకాలు, పలు కార్యక్రమాలను గెంటేల వెంకట రమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ దంపతులు, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను పాల్గొని పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. తిరుమలగిరి గ్రామంలోని కొండ కిందనున్న ఆంజనేయ స్వామి వారి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ప్రత్యేకాలంకరణలో కెకండ్రిక దాసాంజనేయ స్వామి



కంచికచర్ల పాత శివాలయంలో కొలువై ఉన్న ఆంజనేయస్వామిని పూజించేందుకు నిల్చున్న భక్తులు



గురుధాంలో హనుమంతునికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



మక్కపేట ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో జరిగిన పూజలో పాల్గొన్న భక్తులు

వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు



జగ్గయ్యపేట అర్బన్ : హనుమజ్జయంతి వేడుకలు పట్టణంలో గురువారం పలు ఆంజనేయస్వామివారి ఆలయాల్లో ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచే ఆంజనేయస్వామి ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శ్రీధర్మశాస్త అయ్యప్పస్వామి ఆలయంలో ఉన్న శ్రీగురుదత్త రాఘవేంద్రస్వామి, అభయాంజనేయస్వాములను భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వివిధ రకాల పండ్లతో అభిషేకాలు నిర్వహించారు. అలాగే స్థానిక ఆనంద సాయి ఆలయం వద్ద ఉన్న ఉన్న శ్రీదాసాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్యనారాయణపురం శ్రీరాం బంటు తోటలో వేంచేసియున్న శ్రీరాంబంటు ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకులు గండికోట శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో మహాగణపతి పూజ, మంటపారాధన, మహన్యాసపూర్వక మన్యసూక్త రుద్రాభిషేకం, అరటిపండ్లు, తమలపాకులతో విశేష కదలీఫల, నాగవల్లి దళార్చన ఘనంగా నిర్వహించారు. చెరువుకట్టమీద ఉన్న శ్రీఆంజనేయస్వామి ఆలయంలో అర్చకులు ముడుంభా వరదాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి లక్షమల్లెలు, తమలపాకులు, తులసిలతో పూజలు, క్షీరాభిషేకాలు నిర్వహించారు. ఇంకా విజయవాడ రోడ్‌లోని శ్రీసంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో, బ్రాహ్మణబజారులో ఉన్న దాసాంజనేయస్వామి ఆలయం, దాండేనగర్‌లో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో, అద్దాలబజారులోని పాత వెంకటేశ్వరస్వామి ఆలయం స్థలంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణ శివారులో ఉన్న విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ మైన్స్ క్వార్టర్స్ వద్ద ఉన్న శ్రీభూసమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి వారి ఆలయ ప్రాంగణంలో ఉన్న శ్రీపంచముఖ ఆంజనేయస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.





లక్ష మల్లెలార్చన పూజలో పల్లగిరి అభయ వీరాంజనేయ స్వామి

దాసాంజనేయ స్వామికి పంచామృతాభిషేకం





రజతకవచాలంకారంలో దర్శనమిస్తున్న ఆంజనేయస్వామి

ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి



పరిటాలలో అంజనీపుత్రుడికి పూజలు చేస్తున్న భక్తులు



కంచికచర్ల రామాలయంలో ప్రసన్నాంజనేయ స్వామికి పూజలు చేస్తున్న దృశ్యం



పరిటాలలో స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేస్తున్న అర్చకులు



లింగగూడెం రోడ్డు వద్ద పూజలందుకుంటున్న ఆంజనేయస్వామి

మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన ఎంపీపీ మలక్‌బషీర్



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్సీ డాక్టర్ అరుణ్‌కుమార్, ఎంపీపీ షేక్ మలక్‌బషీర్

కంచికచర్ల :ఎంపీపీ షేక్ మలక్‌బషీర్ తాడేపల్లి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు కూటమి ప్రభుత్వంలో ఎదుర్కొంటున్న సమస్యలను మాజీ సీఎంకు విన్నవించారు. సానుకూలంగా స్పందించిన మాజీ సీఎం జగన్ ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తల యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్ అక్రమ తరలింపుపై విచారణ



కొంగరమల్లయ్య గట్టు వద్ద విచారణ చేస్తున్న డెప్యూటీ కలెక్టర్ పోసుబాబు

గట్టుభీమవరం(వత్సవాయి):మండలపరిధిలోని గట్టుభీమవరం, వత్సవాయి రెవెన్యూల పరిధిలో ఉన్న కొంగరమల్లయ్య గట్టు, వేములనర్వ పరిధిలో గట్టు నుంచి అక్రమ మైనింగ్‌పై అందిన ఫిర్యాదు మేరకు విజయవాడ డెప్యూటీ కలెక్టర్ పోసుబాబు గురువారం విచారణ నిర్వహించారు. ముందుగా కొంగరమల్లయ్య గట్టు సర్వే నంబర్ 277/1 లో ప్రభుత్వం ఇచ్చిన అనుమతులకు మించి జరిగిన గ్రావెలింగ్‌పై కొలతలు తీశారు. ప్రభుత్వం ఇచ్చిన మేరకే గ్రావెలింగ్ జరిగిందా, అదనంగా జరిగిందా అన్నదానిపై విచారణ చేశారు. అదేవిధంగా వేములనర్వ గుట్ట వద్ద సర్వే నంబర్ 213 లో 5.68 సెంట్ల భూమిని సాగుచేసుకుందుకు ఏడుగురు రైతులకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. అయితే ఆ భూమిలో రైతులు సాగుచేసుకోకుండగా గ్రావెల్‌ను అక్రమంగా అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారని వత్సవాయికి చెందిన మందడపు రామారావు మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేయగా దానిపై విచారణ నిర్వహించి రైతుల నుంచి రాతపూర్వక నివేదిక తీసుకున్నారు. విచారణలో వెల్లడైన అంశాలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో విజయవాడ రూరల్ తహసీల్దార్ సుగుణ, భీమవరం, చిల్లకల్లు వీఆర్వోలు జి స్వామి, ఎస్‌కే హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోండి



పేట గ్రంథాలయంలోని సమ్మర్ క్యాంప్‌లో గణితం నేర్పుతున్న ఉపాధ్యాయుడు

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి ఎ.ప్రభ తెలిపారు. విద్యార్థులతో పుస్తక పఠనం, కథలు చెప్పించడం చేయించారు. అనంతరం భారతదేశ మొదటి మహిళా రాష్ట్రపతి ప్రతిభా పాటిల్ గురించి చదివి వినిపించి వారి గురించి వివరించారు. అలాగే గణిత ఉపాధ్యాయుడు సీతారామ్ రిలేషన్స్ రీజనింగ్ నేర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది శ్యామల, రమేష్, రాము పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన తరగతులు

కొణకంచి(పెనుగంచిప్రోలు):స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు కొనసాగుతున్నాయి. గురువారం విద్యార్థులచే పుస్తక పఠనం చేయించటంతో పాటు పాటలు పాడించి, క్యారమ్స్, చెస్ వంటి ఆటలు ఆడించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అల్లూరు రామచంద్రుడు, పాఠకులు పాల్గొన్నారు.

యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం

జగ్గయ్యపేట అర్బన్:జూన్ నెల 21 వ తేదీన అంతర్జాతీయ యోగా డే సందర్భంగా జగ్గయ్యపేట మున్సిపల్, సచివాలయ సిబ్బందికి గురువారం యోగాసనాలపై శిక్షణ నిర్వహించారు. కార్యాలయంలోని మీటింగ్ హాల్లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో యోగా గురువులచే యోగాసనాలు నేర్పించారు. మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావు మాట్లాడుతూ నేటి యాంత్రిక సమాజంలో యోగా ఎంతో ప్రాధాన్యం సంతరించుకుందని చెప్పారు. యోగాసనాల వలన శారీరక, మానసిక ఆరోగ్యం లభిస్తుందన్నారు. ముఖ్యంగా ఏకాగ్రత పొందవచ్చునన్నారు.